క్లుప్తంగా

నేడు ఆదివాసీ గిరిజన ఉద్యోగ సంక్షేమ సంఘం సమావేశం

రంపచోడవరం: ఆదివాసీ గిరిజన ఉద్యోగుల సంక్షేమ, సాంస్కృతిక సంఘం సమావేశం రంపచోడవరంలో ఆదివారం నిర్వహిస్తున్నట్టు జిల్లా కార్యదర్శి కత్తుల ఆదిరెడ్డి, తెలిపారు. కమిటీ ఏర్పాటు చేసి ఎనిమిది సంవత్సరాల కాలం గడువు పూర్తి కావడం, కొత్త జిల్లా ఏర్పాటుతో నూతన కమిటీ ఏర్పాటు అవశ్యకత ఉందన్నారు. చింతూరు, రంపచోడవరం డివిజన్‌లలోగల ఆరు ఆదివాసీ తెగలైన కొండరెడ్డి, కోయ, కొండ కమ్మర, కొండ కాపు, మన్నె దొర, అరకు, పాడేరు డివిజన్‌లలో గల ఆరు ఆదివాసీ తెగలైన బగత, కొండ దొర, నూక దొర, కోందు, కొటియా, గదబ. అల్లూరి జిల్లాలో గల మొత్తం ఈ 12 ఆదివాసీ తెగల నాయకత్వం, సభ్యులతో ఈ అత్యవసర సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆదివాసీల హక్కులు, చట్టాలు, రిజర్వేషన్‌ల పరిరక్షణ కోసం ఈ 12 ఆదివాసీ తెగలు ఐక్య పోరాటాలు, ఉద్యమాలు, నిరసనలు చేయాల్సిన అవసరం దృష్ట్యా జరగనున్న ఈ అత్యవసర సమావేశానికి ఎంతో ప్రాధాన్యత ఉందన్నారు.

ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమర్జెన్సీ కాల్ సెంటర్

హుకుంపేట: గడిచిన వారం రోజులగా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాల కారణంగా నియోజక వర్గంలోని ఆరు మండలాల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అరకు ఎమ్మెల్యే రేగం మత్స్యలింగం తెలిపారు. శనివారం ఆయన మాట్లాడుతూ నిస్సహాయ స్థితిలో ఉన్నవారు సాయం కోసం అరకులోయలోని తమ క్యాంపు కార్యాలయంలో ఎమర్జెన్సీ కాల్ సెంటర్‌లోని 9491031141 నంబర్‌కు సంప్రదించాలని ఆయన కోరారు. వెంటనే కార్యాలయ సిబ్బంది, కార్యకర్తలు స్పందించి సహాయ చర్యలు చేపడతారని ఆయన పేర్కొన్నారు.

విద్యార్థుల చదువుపై ప్రత్యేక శ్రద్ధ అవసరం



పాఠశాల ఆవరణలో మొక్కలు నాటుతున్న విద్యార్థుల తల్లిదండ్రులు, విద్యార్థులు

రంపచోడవరం: మండలంలోని పెదగెద్దాడ ఎంపీపీఎస్ పాఠశాలను విద్యాశాఖ ఏఎంఓ రమేష్ శనివారం సందర్శించి టీచ్ టూల్ ప్రోగ్రామ్ గురించి వివరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల్లో పఠన నైపుణ్యాన్ని పెంచాలన్నారు. పాఠశాల ఆవరణలో, ప్రభుత్వ కార్యాలయం సమీపంలో మొక్కలు నాటడం, విద్యార్థులను పర్యావరణ పరిశీలనలో భాగస్వాములను చేయాలన్నారు. సేవ్ వాటర్, సేవ్ ఎర్త్, ప్లాస్టిక్ వాడకం వలన కలిగే నష్టాలపై విద్యార్థులను చైతన్యం చేయాలన్నారు. విద్యార్థుల చదవుపై ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని ఉపాధ్యాయులకు సూచించారు. పర్యావరణ పరిసరాల పట్ల ఆసక్తిని, సంరక్షణ భావాన్ని పెంపొందించడమే ఎకో క్లబ్స్ మిషన్ లైఫ్ కార్యక్రమాన్ని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓ -2 రామకృష్ణ, హెచ్ఎం రాజేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విధుల్లో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు



అధికారులతో సమీక్ష నిర్వహిస్తున్న ఎమ్మెల్యే శిరీషదేవి

రాజవొమ్మంగి: స్థానిక ఎంపీపీ సమావేశ మందిరంలో పలు శాఖల అధికారులతో రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీషదేవి శనివారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ విధుల నిర్వహణలో నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని హెచ్చరించారు. పలు శాఖల్లో పెండింగ్ ఉన్న పనులను పూర్తి చేయాలన్నారు. మహిళా సంఘాలకు రుణాలు మంజూరుకు కొంతమంది లంచాలు తీసుకొంటున్నట్టు తన దృష్టికి వచ్చిందని, వాస్తవం అయితే బాధ్యులపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా అధికారులు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ గోము వెంకటలక్ష్మి, జెడ్పీటీసీ సభ్యులు జ్యోతి, ఎంపీటీసీ సభ్యులు, ఎంపీడీవో యాదగిరీశ్వరరావు, నాయకులు పెద్దిరాజు, భాస్కర్, తాతారావు, తాము సూరిబాబు తదితరలు పాల్గొన్నారు.

సాగునీరు ప్రశ్నార్థకం



పిచ్చిమొక్కలతో నిండిన చెరువు



వివరాలతో ఏర్పాటు చేసిన శిలాఫలకం



పాడైన మదుము

- అధ్వానంగా నేరేడుమాను చెరువు
- రూ.26 లక్షలు కేటాయించినా ఫలితం శూన్యం
- గేట్లు లేక వృథాగా పోతున్న నీరు
- పిచ్చిమొక్కలతో నిండిన వైనం

కొయ్యూరు: మీరు నమ్మినా నమ్మకపోయినా ఇది ముమ్మాటికి చెరువే...తుప్పలతో నిండిపోయిన ఈ చెరువు మూడు సంవత్సరాల కిందట అమృత సరోవర్ కార్యక్రమంలో ఎంపికైంది. బాగు చేయడానికి నిధులు కేటాయించారు. పనులు మాత్రం పూర్తిగా జరగలేదు. దీంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.. మర్రివాడ పంచాయతీ దొడ్డవరం నేరేడుమాను చెరువుకు రూ.26.64 లక్షలు కేటాయించారు. ఇందులో కొంత నిధులను వెచ్చించి చెరువులో తుప్పలను తొలగించారు. కొంత భూమిని చదును చేశారు. అనంతరం ఎటువంటి పనులు చేయలేదు. దీంతో చెరువులో చేరిన నీరు వృథాగా మారింది. ఈ చెరువుకు రెండు వైపులా గేట్లున్నాయి. ఒకటి చీడిపాలెం వైపు,, మరొకటి చెరువు కింద ఆయకట్టుకు అనుసంధానమై ఉంది.. అయితే గేటు పాడైపోవడంతో నీరు నిల్వ ఉండడం లేదు. మదముల వద్ద గేట్లు లేక సాగునీరు కింద పొలాలకు చేరడం లేదని రైతులు చెబుతున్నారు. దీంతో పాటు కాలువలో పూర్తిగా పిచ్చి మొక్కలతో నిండిపోయి ఉన్నాయని, సాగునీరు అందక నానా అవస్థలు పడుతున్నామని చెబుతున్నారు.

గేట్లు ఏర్పాటు చేయక

చెరువు తుప్పలు, పిచ్చిమొక్కలు పేరుకుపోయి పూడికతీత చేపట్టపోవడంతో ప్రస్తుతం కురుస్తున్న వర్షాలకు నీరంతా వృథాగా పోతోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివారు పొలాలకు నీరందడం లేదని వారు ఆందోళన చెందుతున్నారు. అధికారులు త్వరితగతిన స్పందించి చెరువులో పూడికతీత చేపట్టడంతో పాటు గేట్లు ఏర్పాటుచేసి శివారు భూములకు సాగునీరందేలా చూడాలని వారు కోరుతున్నారు. దీనిపై ఏపీవో రాజు మాట్లాడుతూ చెరువులో పూడికతీత, పిచ్చిమొక్కలు పనులను ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు చేపడతామన్నారు. మదుముల వద్ద గేట్ల ఏర్పాటు మరమ్మతు పనులకు సంబంధించి ప్రతిపాదనలను ఉన్నతాధికారులకు నివేదిస్తామని నీటి పారుదల శాఖ జేఈ రామకృష్ణ తెలిపారు. నిధులు మంజూరైతే పనులు చేపడతామన్నారు.

విద్యార్థుల ఆరోగ్యంపై ప్రత్యేక శ్రద్ధ



గురుకుల పాఠశాల వద్ద మొక్కలు నాటుతున్న ఎంఈవో శ్రీనివాసరావు, ఉపాధ్యాయులు

అడ్డతీగల: మండల కేంద్రంలోని గురుకుల పాఠశాలను ఎంఈవో పి.శ్రీనివాసరావు శనివారం సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థుల విద్యా సామర్థ్యాలను పరిశీలించారు. మధ్యాహ్నం భోజన అమలుపై ఆరా తీశారు. ఉపాధ్యాయుల, విద్యార్థుల హాజరు శాతం పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థుల ఆరోగ్యపరంగా తగిన జాగ్రత్తలు తీసుకోవాలని ఆయన సూచించారు. వసతి గృహంతో పాటు ఆహార పదార్థాలు తయారు చేస్తున్న ప్రాంతాల వద్ద పరిశుభ్రత పాటించాలన్నారు. అనంతరం విద్యార్థులు, తల్లిదండ్రులు, ఉపాధ్యాయులుతో కలిసి పాఠశాల ఆవరణలో మొక్కలు నాటారు.



విద్యార్థినులకు ఆరోగ్య భద్రతపై సూచనలిస్తున్న వైద్యాధికారి డాక్టర్ భావన

విద్యార్థినులకు ఆరోగ్యభద్రతపై సూచనలు

గంగవరం: మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను స్థానిక పీహెచ్‌సీ వైద్యాధికారి డాక్టర్ భావన తన సిబ్బందితో కలసి సందర్శించారు. బాలికలు వసతి గదులతో పాటు వంటశాలను పరిశీలించారు. వంట పనివారు చేతుల శుభ్రం చేసుకోవాలని, వంటశాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. మరుగుదొడ్లను పరిశీలించారు. మరుగుదొడ్లు పరిశుభ్రంగా ఉంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. విద్యార్థినిలు ఆరోగ్య పరంగా తీసుకోవాల్సిన జాగ్రత్తలు సూచించారు. ఏఎన్ఎం పద్మప్రియ, సూపర్‌వైజర్లు విజయలక్ష్మి, సూరిబాబు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

- ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు : పరిసరాల పరిశుభ్రత ప్రతి ఒక్కరి బాధ్యత అని ఐటీడీఏ పీవో వి.అభిషేక్ అన్నారు. పట్టణంలోని ఐటీడీఏ రేకులకాలనీ ప్రాంతంలో నిల్వ మురుగు నీటిలో ఆయిల్స్ బాల్స్ వదిలి దోమలను నివారించే కార్యక్రమంలో శనివారం ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా పీవో అభిషేక్ మాట్లాడుతూ ప్రభుత్వ ఆదేశాల మేరకు ఐటీడీఏ పరిధిలోని 11 మండలాల్లో ఈ నెల 25 నుంచి ఆగస్టు 10 వరకు పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహిస్తున్నామన్నారు. ఏజెన్సీలో సీజనల్‌గా ప్రబలే మలేరియా, డెంగ్యూ, టైఫాయిడ్ తదితర రోగాలను సమర్థంగా ఎదుర్కొనేందుకు మలేరియా, పంచాయతీరాజ్, వైద్య ఆరోగ్య శాఖ, గ్రామీణ నీటి సరఫరా శాఖలు సంయుక్తంగా పనిచేయాలన్నారు. అన్ని గిరిజన గ్రామాల్లో దోమల నివారణకు ఫాగింగ్ చేయాలని, తాగునీరు కలుషితం కాకుండా క్లోరినేషన్ చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు.



మురుగు కాలువలో నీటిని శుభ్రం చేయిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పరిసరాల పరిశుభ్రతతో ఆరోగ్యం



అరకులోయలో ర్యాలీలో పాల్గొన్న అధికారులు, ప్రజాప్రతినిధులు



జీకే వీధిలో పనులను పర్యవేక్షిస్తున్న ఎంపీడీవో ఉమామహేశ్వరరావు, ఈవోపీఆర్డీ పాపారావు



మర్రిపాలెంలో నిల్వ నీటిలో ఆయిల్ బాల్స్ వేయిస్తున్న ఎంపీడీవో లాలం సీతయ్య



రంపచోడవరంలో పారిశుధ్య పనులను పర్యవేక్షిస్తున్న సర్పంచ్ బొజ్జయ్య

అరకులోయ రూరల్: పారిశుధ్య పక్షోత్సవాల్లో భాగంగా జిల్లా వ్యాప్తంగా అన్ని గ్రామాల్లో అధికారులు శనివారం పారిశుధ్య పనులు చేయించారు. గ్రామల్లో పరిసరాలను శుభ్రం చేయించారు. వాడవాడలా అవగాహన ర్యాలీలు నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు మాట్లాడుతూ పరిసరాల పరిశుభ్రతతోనే ఆరోగ్యం కలుగుతుందన్నారు. ప్లాస్టిక్, పాలిథిన్ వినియోగాన్ని పూర్తిగా నిషేధించాలని కోరారు. ఆయా వస్తువులు పర్యావరణానికి తీవ్ర విఘాతం కలిగిస్తాయన్నారు. ప్లాస్టిక్ నిషేధానికి అందరూ సహకరించి, పర్యావరణ పరిరక్షణకు కృషి చేయాలన్నారు. పాలిథిన్ సంచులు విక్రయిస్తే జరిమానా విధిస్తామన్నారు. పరిసరాల పరిశుభ్రత సామాజిక బాధ్యత అన్నారు. ప్రతీ గ్రామంలో పారిశుధ్య పక్షోత్సవాలు నిర్వహించాలన్నారు. నీరు నిల్వ లేకుండా చూసుకోవాలని, లార్వా అభివృద్ధి చెందకుండా ఆయిల్ బాల్స్ వేయాలని సూచించారు. ప్రతీ ఒక్కరు పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని తెలిపారు.

అరకులోయ మండల కేంద్రంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో వెంకటేష్, పంచాయతీ ఈవో రాజ్‌కుమార్, సర్పంచ్ దాసుబాబు, పంచాయితీ, సచివాలయం ఉద్యోగులు పాల్గొన్నారు.

గూడెంకొత్తవీధి: మండలంలో జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో ఉమామహేశ్వరరావు , ఈవోపీఆర్డీ పాపారావు, పంచాయతీ కార్యదర్శి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

కొయ్యూరు: మండలంలోని జరిగిన కార్యక్రమంలో ఎంపీడీవో లాలం సీతయ్య, సర్పంచ్ రావుల వెంకటలక్ష్మి, వార్డు సభ్యులు చలపతి, పంచాయతీ కార్యదర్శులు రవీంద్ర, రేష్మ, ఫీల్డ్ అసిస్టెంట్ సింహాచలం, వైద్య, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

రంపచోడవరం: మండలంలోని జరిగిన కార్యక్రమంలో సర్పంచ్ మంగా బొజ్జయ్య, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తం

- దోమ తెరలు వాడాలి
- పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలి
- పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్



డాక్టర్ కె.నిఖిల్

పెదబయలు: వర్షాలు విస్తారంగా కురుస్తున్నందున ఎక్కడి బడితే అక్కడ నీరు నిల్వ అయ్యి దోమలు పెరిగే అవకాశం ఎక్కువగా ఉందని దోమల నుంచి రక్షణ పొందేందుకు ప్రతీ ఒక్కరు దోమ తెరలను వాడాలని పీహెచ్‌సీ వైద్యాధికారి నిఖిల్ అన్నారు. ఆయన విలేకరులతో మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలో భారీ వర్షాలు కురుస్తుందని చాలా ప్రాంతాల్లో వర్షం నీరు నిల్వ అయ్యి దోమలు పెరిగే అవకాశం ఉందని దీంతో మలేరియా, డెంగ్యూ, ఫైలేరియా, చికున్ గున్యా ఇతర వ్యాధులు ప్రబలే అవకాశముందన్నారు. సీజనల్ వ్యాధులపై అందరూ అప్రమత్తంగా ఉండాలన్నారు. దోమ కాటు వల్ల వచ్చి ప్రాణాలకు మీదకు వస్తుందన్నారు.దోమల ఉత్పత్తి కాకుండా ఇంటి పరిసరాల్లో మురుగు నీరు నిల్వ లేకుండా నీరు పోయే విధంగా చూడాలన్నారు. అలాగే ఇంటి పరిసరాల్లో పూలకుండీలు, రిఫ్రిజిరేటర్లు, టైర్లు, కొబ్బరి బోండాలు, పాస్టిక్ కవర్లలో నీరు నిల్వ లేకుండా చూడాలన్నారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. కాచి చల్లార్చిన నీరు తాగాలని. అలాగే ఊట నీరు త్రాగే వారు మరిగించి చల్లార్చి వడగట్టి తాగాలన్నారు. ప్రస్తుతం పడుతున్న వర్షాలకు నీరు కలుషితం అవుతుందన్నారు.కలుషిత నీరు తాగడం వల్ల డయేరియా. పచ్చ కామెర్లు,పోలియో వంటి వ్యాధులకు గురయ్యే అవకాశం ఉందన్నారు. అలాగే డయేరియా అడల్ట్ వ్యాక్సిన్ 18 ఏళ్ల దాటిన వారందరు వేసుకుంటే భవిష్యత్తులో టీబీ వ్యాధి రాకుండా అరి కట్టవచ్చన్నారు. ఆహారం తీసుకునే సమయంలో చేతులను సబ్బుతో శుభ్రం చేసుకోవాలన్నారు. చేతులు శుభ్రంగా కడుక్కోవడం వల్ల 75 శాతం వ్యాధులు నుంచి దూరంగా ఉంచవచ్చన్నారు. వేడి పదార్థాలు తీసుకోవాలని, వండి ఆహార పదార్థాలకు తప్పని సరిగా మూతలు వేయాలన్నారు. అనారోగ్యమైతే వెంటనే ఆస్పత్రికి వచ్చి పరీక్షలు చేసుకోవాలన్నారు.

మన్యంలో భారీ వర్షాలు... తప్పని అవస్థలు



పెదబయలులో ఉధృతంగా పొంగి ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ



సుత్తిగూడ కల్వర్టుపై నుంచి ప్రవహిస్తున్న వరదనీరు



తడిగిరిలో గెడ్డ దాటుతున్న గిరిజనులు



కామయ్యపేట పాఠశాలలో విరిగిపడిన వృక్షం



గూడెంకొత్తవీధిలో వర్షాలకు నేలకూలిన విద్యుత్ స్తంభం



కంపుమానుపాకలులో వర్షాలకు దెబ్బతిన్న గిరిజనుడి ఇంటిగోడ

పెదబయలు: జిల్లా వ్యాప్తంగా వారం రోజులకు పైగా భారీ వర్షాలు కురుస్తున్నాయి. గ్రామాల్లో గెడ్డలు, వాగులు పొంగి ప్రవహిస్తున్నాయి. చాలా ప్రాంతాలకు రాకపోకలు నిలిచిపోయాయి. గిరిజనులు ఇళ్ల వద్దే పరిమితం అయ్యారు. నిత్యావసర సరకుల కోసం నానా అవస్థలు పడుతున్నారు. వీధుల్లో వర్షపు నీరు చేరి చెరువుల్ని తలపిస్తోంది. రోడ్లపై మోకాళ్ల లోతు నీరు నిల్వ అయింది. కాజ్‌వేలు, కల్వర్టులు కొట్టుకుపోయాయి. రహదారులు కోతకు గురయ్యాయి. వాహనచోదకులకు ఇక్కట్లు తప్పడం లేదు.

పెదబయలు గ్రంథాలయం వీధిలో వర్షపు నీటి నిల్వతో తలెత్తిన సమస్యను స్థానికులు ఎంపీడీవో విగ్గిన్స్ దృష్టికి తీసుకెళ్లారు. పంచాయతీ విస్తరణ అధికారి నర్సింగరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ కురేష్ వచ్చి పరిశీలించారు. సీసీ రోడ్డుపై నిలిచిన నీటిని ముందుకు వెళ్లేందుకు ప్రహరీకి రంధ్రం ఏర్పాటు చేసి పైపుల ద్వారా నీరు విధంగా చర్యలు తీసుకుంటామన్నారు.ఇక్కడ డ్రైనేజీ ఏర్పాటుకు ప్రతిపాదనలు పంపిస్తామన్నారు.

ముంచంగిపుట్టు: మండలంలో సుత్తిగూడ గ్రామ సమీపంలో కల్వర్టుపై నుంచి భారీగా వరదనీరు ప్రవహించడంతో 28 గ్రామాలకు రాకపోకలు నిలిచిపోయాయి. జర్జుల పంచాయతీ గుర్రాలబయలు గ్రామంలో బి.భగీరథ, కె.లోకినాథ్‌ల గృహాలు నేలమట్టమయ్యాయి.ఈ విషయం తెలుసుకున్న మండల వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు పాంగి పద్మరావు, మండల వైఎస్సార్‌సీపీ నేతలు రాంప్రసాద్, ప్రసాద్ గ్రామంలో పర్యటించి, బాధిత కుటుంబాలను పరామర్శించారు. జరిగిన నష్టంపై ఆరా తీశారు. ప్రభుత్వం ఆదుకోవాలని వారు కోరారు. వనుగుమ్మ పంచాయతీ కిరాంబో గ్రామంలో పాంగి సామేశ్వరరావు ఇంటి గొడలు కూలిపోయాయి. రేకులు ధ్వంసమయ్యాయి. బాధిత కుటుంబాన్ని వైస్ ఎంపీపీ భాగ్యవతి, భర్త దేవా తదితరులు పరామర్శించారు. సుజనకోట పంచాయతీ కేంద్రానికి చెందిన గోపాల్ అనే గిరిజనుడి ఇళ్ల నేలమట్టం అయింది.ఆ సమయంలో ఇంట్లో ఉన్న అతని భార్య మాలతి చేతికి స్వల్పగాయమైంది. నిలువ నీడ కరువైందని, ప్రభుత్వం అన్ని విధాలుగా అందుకోవాలని బాధితులు కోరుతున్నారు.

హుకుంపేట: మండలంలోని తడిగిరి పంచాయతీ కేంద్రానికి వెళ్లే ప్రధాన రహదారి కల్వర్టులో వరదనీరు పొంగి ప్రవహిస్తోంది. తీగలవలస పంచాయతీ కామయ్యపేట ప్రభుత్వ పాఠశాలకు ఎదురుగా ఉన్న వృక్షం వర్షానికి నేల కూలింది. పాఠశాలలకు సెలవు ప్రకటించడంతో విద్యార్థులకు పెనుప్రమాదం తప్పింది. గంటల తరబడి వాహనాల రాకపోకలకు అంతరాయం కలిగింది.

గూడెంకొత్తవీధి: ఎడతెరిపివ్వని వర్షాలకు మండల కేంద్రంలో వీధి దీపం స్తంభం పడిపోయింది. ఆ సమయంలో ఎవరూ లేకపోవడంతో ప్రమాదం తప్పింది. కంపుమానుపాకలు గ్రామంలో వంతల అప్పారావు అనే గిరిజనుడి ఇంటి గోడ వర్షాలకు దెబ్బతింది.

జి.మాడుగుల: మండలంలో భారీవర్షాలకు గెమ్మెలి పంచాయతీ ఊడపాలెం పాతవీధి గ్రామానికి చెందిన లువ్వాబు సీతారామ్‌కు చెందిన పెంకుటిల్లు కూలిపోయింది. కిల్లంకోట పంచాయతీ కె.బందవీధి గ్రామానికి చెందిన కొలపరి రాజు చెందిన ఇంటి గోడ కూలింది. వై.రాపల్లి గ్రామానికి చెంది ఉడ్డు నారాయణరావుకు చెందిన పెంకుటిల్లుపై చింతచెట్టు పడడంతో ఇల్లు దెబ్బతింది. వర్షాలకు దెబ్బతిన్న ఇళ్లకు ప్రభుత్వం తక్షణమే నష్టపరిహారం అందించి పక్కా ఇళ్లు మంజూరు చేయాలని బాధిత గిరిజనులు కోరుతున్నారు.



ఊడపాలెంపాతవీధిలో వర్షానికి దెబ్బతిన్న పెంకుటిల్లు



కె.బందవీధిలో వర్షానికి కూలిన ఇంటి గోడ



గుర్రాబయలులో బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

బోసిపోయిన వారపు సంత



కొనుగోలుదారులు లేక వెలవెలబోయిన సంత

ముంచంగిపుట్టు: మండల కేంద్రంలో శనివారం జరిగిన వారపు సంతకు వర్షం దెబ్బతగిలింది. ఏకధాటిగా కురుస్తున్న వర్షంతో సంత ప్రాంగణమంతా వరదనీటి ప్రవాహంతో బురదమయంగా మారింది. ఉదయం 7 గంటలకు వచ్చిన కూరగాయల రైతులు మధ్యాహ్నం 12గంటల వరకు అమ్మకాలు చేసేందుకు వీలు లేకుండా వర్షం పడుతూనే ఉంది. ఎంత సేపటికి వర్షం తగ్గకపోవడంతో కూరగాయలు చేత పట్టుకొని తీవ్ర నిరాశతో కొంతమంది గిరిజన కూరగాయల రైతులు ఇంటిబాట పట్టారు. మరికొంత మంది నష్టానికై కూరగాయలను దళారులకు అమ్మి వెళ్లిపోయారు. తుపాను ప్రభావంతో మైదాన ప్రాంత వ్యాపారులు ఎవరూ సంతకు రాలేదు. ఎన్నడూ లేని విధంగా వారపు సంత వర్షంతో రెండు గంటలకై ముగిసింది.

పిచ్చికుక్క దాడిలో గిరిజనుడికి గాయాలు

గూడెంకొత్తవీధి: కంపుమానుపాకలు గ్రామంలో శనివారం పిచ్చికుక్క దాడిలో గిరిజనుడు తీవ్రంగా గాయపడ్డాడు. వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన జోగిదొర ఉదయం కాలకృత్యాల కోసం బయటకు వెళ్తుండగా పిచ్చికుక్క అతనిపై దాడి చేసింది. కాళ్లు, చేతులపై తీవ్రంగా కరవడంతో అతన్ని స్థానికులు హుటాహుటిన ఆస్పత్రికి తరలించారు.

ఎండీటీ మాత్రలు పంపిణీ

కె.కోటపాడు: కనురెప్పలు మూతపడిపోవడం, ముక్కు దిబ్బడ, ముక్కు వెంబడి రక్తం కారడం వంటి కుష్టు లక్షణాలు ఉంటే ఎండీటీ మాత్రలు ఉచితంగా ఇవ్వనున్నట్లు వైద్యాధికారి తరణి తెలిపారు. శనివారం గుల్లేపల్లిలో ప్రజలకు అవగాహన కల్పించారు. ఆమె మాట్లాడుతూ ఆరోగ్య కార్యకర్తలు వచ్చే నెల 2వ తేదీ వరకు ఇంటింటికి వచ్చే సమయంలో కుష్టు వ్యాధి నిర్ధారిత పరీక్షలు చేయించుకోవాలని తెలిపారు. శరీరంపై రాగి రంగు మచ్చలు, కనురెప్పలు, కనుబొమ్మలపై వెంట్రుకలు రాలిపోయే సమస్య ఉన్నవారు వెంటనే వైద్యులను సంప్రదించాలన్నారు.